# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 21-01-2026** సమయం : **6.45** గంటలు

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పురోగతికి “ఒక కుటుంబం - ఒక పారిశ్రామిక వేత్త” విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

2. దావోస్‌లో పర్యటిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి.. ఇజ్రాయెల్ ఇన్నొవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో సమావేశమైయ్యారు.

3. గ్రీన్ కవర్ ప్రాజెక్టులో భాగంగా కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

4. ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

5. దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్స్ తొలివిడత పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.

==========================

దావోస్ లో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడవ రోజైన ఈరోజు పలు సమావేశాల్లో పాల్గొంటారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో పారిశ్రామిక పురోగతి అంశంపై నిర్వహించే సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. తర్వాత పలు దిగ్గజ ఐటీ సంస్థల చైర్మన్ సీఈఓలతో సమావేశమై చర్చలు జరుపుతారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం -ఏపీ సీఎన్ఎఫ్ నిర్వహించే " పునరుత్పాదక ఆహార వ్యవస్థల ద్వారా భూమి సంరక్షణ" అంశంపై జరిగే చర్చా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లాంజ్ లో నిర్వహించే బిల్డింగ్ ఇండియా ఇన్ఫ్రా స్ట్రక్చర్ కార్యక్రమంలో కేంద్రమంత్రులతో కలిసి ముఖ్యమంత్రి హాజరు అవుతారు. వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ రీజెనరేషన్ మొబిలైజింగ్ కేపిటల్ పేరిట నిర్వహించే మరో కార్యక్రమంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

----------------------

ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక పురోగతికి "ఒక కుటుంబం - ఒక పారిశ్రామిక వేత్త" విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా నిర్వహించిన ఒక కుటుంబం - ఒక పారిశ్రామిక వేత్త విధానంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, భారత్ ఉత్పత్తి రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఇందుకు అనుగుణంగా ఒన్ ఫ్యామ్లీ-ఒన్ ఎంటర్ ప్రెన్యూయర్ విధానం అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు.

వాయిస్.. 30 సెకన్లు

-----------------------

దావోస్ లో పర్యటిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి.. ఇజ్రాయెల్ ఇన్నొవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ -ఏఐ, సైబర్ భద్రత, ఆరోగ్య, వ్యవసాయ, ఏరోస్పేస్ రంగాల్లో తెలంగాణకు ఇజ్రాయెల్ దేశం సహకారం అందించనుందని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ఇజ్రాయిల్ అంకుర సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో పైలట్ ప్రోగ్రామ్స్ నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కవర్ ప్రాజెక్టులో భాగంగా కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గ్రీన్ కవర్ ప్రాజెక్టుపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు ప్రణాళికలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం పచ్చదనం ఉండగా, వచ్చే నాలుగేళ్లలో మరో 7 శాతం పెంచేలా 9 లక్షల హెక్టార్లలో చెట్లను నాటాలని సూచించారు. గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వదేశీ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిర్దేశిత

లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు ఉగాదిలోపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

-----------------------

గ్రామీణ ప్రాంతాల్లోనూ సురక్షిత త్రాగునీరు అందించేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం చందపర్రు గ్రామంలో రహదారివిస్తరణ పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 31 సెకన్లు

-----------------------

నాణ్యత ప్రమాణాలతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో రహదారుల నిర్మాణంపై సాలూరులో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని మక్కువ ప్రధాన రహదారి పనులకు 2 కోట్ల 65 లక్షల రూపాయలను మంజూరు చేశామని తెలిపారు. భవిష్యత్తులో అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారుల రూపకల్పన చేయాలని, పనులు వేగవంతంగా పారదర్శకంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మార్కాపురం జిల్లా కనిగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన నిన్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం రిలయన్స్ సిబిజీ ప్లాంట్ ను పరిశీలించారు. కనిగిరిలో 6 కోట్ల రూపాయలతో నిర్మించిన పెద్దఇర్లపాడు-మాలకొండ రోడ్డును ప్రారంభించి, విద్యుత్ ఉపకేంద్రానికి శంఖుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి విద్యుత్ ఉపకేంద్రాలను నిర్మిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ 34 సెకన్లు

-----------------------

జాతీయ స్థాయి ఇంజనీరింగ్ ప్రవేశపరీక్ష- జేఈఈ మెయిన్స్ తొలివిడత పరీక్షలు దేశవ్యాప్తంగా ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 29 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 50వేలకు పైగా తెలంగాణ నుంచి సుమారు 40 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తారని, పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని అధికారులు సూచించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత పెరిగింది. రానున్న మూడు రోజుల్లో చలి గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాల్లో సాధారణం కన్నా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వెల్లడించింది. దట్టమైన పొగమంచు కురుస్తోందని, ఈ నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ఆంధ్రప్రదేశ్లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 4 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

-----------------------

తెలంగాణలోని  మేడారం జాతరకు వచ్చే భక్తుల భద్రతే లక్ష్యంగా రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్  అధికారుల్ని ఆదేశించారు. హైదరాబాద్ లో  ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న  సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతరకు వచ్చే వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్ మార్గాల్లో హోర్డింగ్లను ఏర్పాటుచేయడంతోపాటు బస్‌స్టేషన్లు, బస్సుల్లో టీవీల ద్వారా రహదారి నిబంధనలపై ప్రచారం చేయాలన్నారు. అధిక రద్దీకి అనుగుణంగా బస్సులు నడపడానికి ఆర్టీసీ అధికారులు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

-----------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 130వ

సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈ నెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

----------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజవర్గం కోటపాడు మండలం కింతడలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న కచ్చా రహదారికి, 1.68 కోట్ల రూపాయలతో చేపట్టిన గొండుపాలెం-రంగలినాయుడుపాలెం రోడ్డుకు మంత్రి నిన్న శంకుస్థాపనలు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =